క్లుప్తంగా

భవన నిర్మాణ పనుల పరిశీలన



మరికల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను ఏఈ వెంకటేష్, సర్పంచ్ గోవర్ధన్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనాల ప్రకారం పంచాయతీ భవన నిర్మాణపనులు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు. మండల వ్యాప్తంగా పంచాయతీ భవనాలు కీలక దశకు వచ్చాయన్నారు. ఎక్కడ కూడా నాణ్యతలో తేడా లేకుండా పనులు చేయిస్తున్నామన్నారు. త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.

విత్తనాలు పంపిణీకి సిద్ధం

ఊట్కూరు: మండలంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రంలో గుర్రపు శనగల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు బుధవారం వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జేజీ–11 రకం, 25 కిలో బస్తా 1870 రూ.లకు విక్రయిస్తున్నారని 120 బస్తాలు నిల్వ ఉన్నదని తెలిపారు. అవసరమైన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

యువకుడికి సన్మానం



కోస్గి: పోలీస్‌కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకుడిని బుధవారం స్థానిక మేధరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి కురుమన్న తనయుడు శివకుమార్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, శేఖర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ధన్వాడ: మండల వనరుల కేంద్రంలోని బుధవారం కాంప్లెక్స్ ఇన్‌చార్జి రమేష్‌శెట్టి, రమేష్ శెట్టి దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం జరిగే ఫిజియో థెరఫీ క్యాంప్‌కు హాజరై దివ్యాంగ పిల్లలోని ఆరోగ్యంలో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులకు పలు సూచనలు తెలియజేశారు. దివ్యాంగులు వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాల్‌రాజ్, మాసన్న, రాఘవేందర్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి



మరికల్: ఎన్నికలకోడ్ ఉల్లఘించి పార్టీ జెండాలను ఆవిష్కరించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ లతారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాలు అధికార పార్టీ ఎమ్మెల్యేకు వర్తించవా అంటూ ప్రశ్నించారు. మరికల్, ధన్వాడ మండలాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన ఆయనపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతను పూడ్చాలి



కృష్ణా: ప్రతి నిత్యం వేలాది వాహనాలు తిరిగే టైరోడ్డులోని చౌరస్తాలో బీటీ రోడ్డు కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడ్డది. దీంతో ద్విచక్ర వాహనదారులు పలుమార్లు రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. రాయచూర్ హైదరాబాద్, గుల్‌బర్గ, రాయచూర్‌కు వెళ్లే వాహనాలు ఈ చౌరస్తా గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ప్రమాదం జరగముందే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

- పార్టీ జెండా ఆవిష్కణలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: బీఆర్‌ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతుందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప సమక్షంలో మండలంలోని మద్దెల్‌బీడ్, దామరగిద్ద, బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి ముస్తాపేట్, అయ్యవారిపల్లి, చాకలోన్‌పల్లి యల్సాన్‌పల్లి, ఆశన్‌పల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను మళ్లీగెలిపిస్తాయన్నారు. పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులైన వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరడంతో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. యల్సాన్‌పల్లి, కాన్‌కుర్తి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నాయకులు శరణప్ప, తిప్పణ్ణ, జెడ్పీటీసీ లావణ్య రాములు, కిషన్‌రావు, వెంకట్‌రెడ్డి, బసంత్‌రాజ్, శ్రీనివాస్ షెట్టి, కన్కిరెడ్డి, పుట్టి అంజి, గురునాథ్‌గౌడ్, లోకూర్తి బసంత్‌రెడ్డి, చంద్రశేఖర్, యువజన సంఘం నాయకు లు బస్వరాజ్, జ్ఞానేశ్వర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బాపన్‌పల్లిలో జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



కృష్ణాలో మాట్లాడుతున్న సీఈఓ జ్యోతి



ఊట్కూర్‌లో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ నర్సింహులు

కృష్ణా: బాలికలను సంరక్షించి వారిని ఆరోగ్యవంతంగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఈఓ జ్యోతి, జీసీడీఓ పద్మనళిని అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని హిందుపూర్‌లో కస్తూర్బాబాలికల పాఠశాలలో ఓటరు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటరు పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని అప్పుడే సమాజం అన్నిరకాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, ఎస్‌ఐ విజయభాస్కర్, ఎస్‌ఓ షాలిని, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కవిత, విజయతోపాటు ఉపాధ్యాయులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బాలికల విద్యాభివృద్ధికి కృషిచేద్దామని చైల్డ్‌హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ నర్సింహులు కోరారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శ్రీసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు చొరవ తీసుకొని బాలికలను మంచి చదువులు చదివించాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని లింగ వివక్షత, బాల్యవివాహాలకు ఎవరూ ప్రోత్సహించరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బేటి బచావో–బేటి పడావో అనే పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. సమాజంలో క్షీణిస్తున్న పిల్లల లింగనిష్పత్తి సమస్యను పరిష్కరించేందుకు మహిళా శిశుసంక్షేమ శాఖ కృషిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం ప్రేమకుమారి, శాహిన్, అనిల్, రత్నమ్మ, కౌన్సిలర్ విద్యారాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లిలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఆయన పల్లె పల్లెకు వీజేఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో కలిసి గ్రామపురవీధుల గుండా కలియతిరిగి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. గతంలోను వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అంజేసినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అండగా ఉంటామని గ్రామస్తులకు తెలియజేశారు.



గ్రామస్తులతో సమస్యలు తెలుసుకుంటున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

తహసీల్దార్‌కు సన్మానం



నర్వ: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డిని బుధవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. జక్కన్నపల్లి సర్పంచ్ కోట్ల నాగిరెడ్డి, నాయకులు హన్మంతురెడ్డి, ఎండీ. ఫజల్, నర్సింహారెడ్డి, ఖాజా, అజయ్ పాల్గొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి

మరికల్: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో బీఎస్పీ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ముందుకు రావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజకీయంగా రాణించాలంటే అది బీఎస్పీ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేస్తే రాబోయే ఎన్నికల్లో అధికారం దక్కించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, వెంకటేష్, రామంజనేయులు, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



నర్వ: మండల కేంద్రంలోని కర్రెమ్మ ఆలయ ఆవరణలో ప్రతిష్టించే దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ మండల నాయకులు దండు అయ్యప్ప విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు విగ్రహ ఏర్పాటుకు విరాళం అందించాలని కోరగా రూ. 25వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటుకు విరాళం అందించిన దండు అయ్యప్పను వారు అభినందించారు. కార్యక్రమంలో దుర్గామాత నిర్వాహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ వారీగా పంటసాగు వివరాలు

కృష్ణా: మండలంలోని హిందుపూర్, కున్సి, గుడెబల్లూర్ గ్రామాల్లో బుధవారం సర్వేనంబర్ వారీగా పంట నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, ఏఈఓ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ భూమిలో ఎంత పంట వేశారు అనే విషయాన్ని డిజిటల్ క్యాప్చర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆ రైతుల పేర్లను నమోదు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

తీర్మానం చేసిన తర్వాతనే ఓట్లు వేస్తాం



బాండ్ పేపర్‌ను చూపిస్తున్న యువకులు

మరికల్: గుడి..బడి ఒకే దగ్గర ఉండటంతో విద్యార్థులకు, ఇటు ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలను ఇతర ప్రాంతంలో నిర్మిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థులు బాండ్ పేపర్‌పై సంతకం చేసి తీర్మానం చేసిన వారికే ఓట్లువేస్తామని బుధవారం మాద్వార్ గ్రామస్తులు శపథం చేశారు. గత దశాబ్దాల కాలం నుంచి ఈ విషయాన్ని ఎంతో మంది ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చిన తమ గోడు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ యువకులు తెలిపారు. పాఠశాల భవనం ఇతర ప్రాంతంలో నిర్మిస్తామని మాట ఇచ్చి తప్పితే రాజీనామా చేయాలని ఆ బాండ్ పేపర్‌లో రాసిఉందన్నారు. నిర్ణయనికి కట్టుబడి ఉన్నవారికే తమ గ్రామస్తులు ఓట్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప, వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు తదితరులు

కోస్గి: డీటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు నర్మద సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక జెడ్పీబాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడురోజులపాటు పాలమూరు జిల్లా కేంద్రంలోని భూత్పూర్‌రోడ్డులో ఉన్న అన్నపూర్ణ గార్డెన్స్‌లో ఈ మహాసభలు ఉంటాయన్నారు. మహాసభకు అధిక సంఖ్యలో విద్యావంతులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలన్నారు. క్యాక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణగౌడ్, రాజేందర్‌రావు, రవీందర్‌రెడ్డి, గీతారాణితోపాటు పలువురు పాల్గొన్నారు.

మాగనూర్: ఈ నెల 15, 16, 17వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీఉన్నత పాఠశాల వడ్వాట్‌లో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీటీఎఫ్ నిరంతరం విద్యా, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పోరాడుతూనే ఉందని తెలిపారు. వివిధ సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఏకైక సంఘం డీటీఎఫ్ అన్నారు. విద్యారంగ మౌళిక సమస్యలు మొదలు, పీఆర్‌సీ, జీవో 317, జాతీయ విద్యావిధానం వరకు విద్యా, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. ఈ మహా సభలకు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ బాధ్యుడు వెంకటేష్, ఉపాధ్యాయులు విజయశ్రీ, వరలక్ష్మి, హరిక తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..

సమర్థుడైన నాయుడిని ఎన్నుకుందాం

దామరగిద్ద: గత పదేళ్లుగా ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిషలు కృషిచేస్తున్న సమర్థుడైన నాయకుడు మన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ సాదిద్దామని బీఆర్‌ఎస్ యూత్‌కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, జ్ఞానేశ్వర్, పుట్టి అంజి అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తిలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో పార్టీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బస్వరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బస్వరాజ్

మలుపు.. ప్రమాదానికి పిలుపు



పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మద్దూరు: మద్దూరు నుంచి పెదిరిపాడ్ మీదుగా నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువుకట్ట వద్ద ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఓ సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రోడ్డు గతంలో మోటల్‌రోడ్డు ఉండేది. పదేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ నిధులతో ఈ రోడ్డును బీటీగా మార్చారు. నారాయణపేటకు ఈ రూట్లో వెళ్తే దూరం తగ్గుతుండడంతో ఈ రూట్లో వెళ్లడానికి వాహనదారులు మొగ్గుచూపుతున్నారు. కానీ ఎక్కడ ప్రమాద సూచికలు పెట్టకపోవడం, స్పీడ్ బ్రేక్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మలుపు వద్ద చాలా మందికి గాయాలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదహెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు, ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముద్రసీడ్స్ పత్తి క్షేత్ర ప్రదర్శన



రైతులకు పత్తి పంటను వివరిస్తున్న నిర్వాహకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని లింగంపల్లి వద్ద బుధవారం ముద్రసీడ్స్ వారు రైతులకు ఉచిత పత్తి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఆయా మండలాలకు చెందిన రైతులు, ఆరుగురు డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. మడిగెళముల్లతండా సర్పంచ్ హున్యా నాయక్ మాట్లాడుతూ.. పదిఎకరాలలో రణం పత్తిసీడ్స్ వేశానని మొక్క ఎపుగా పెరిగి దాదాపు ఒక మొక్కకు 80నుంచి వందకాయలు కలిగి 15క్వింటాళ్ల నుంచి 20క్వింటాళ్లలోపు దిగుబడి వస్తుందన్నారు. అనంతరం డైరెక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ.. ఈ పత్తి రకం అన్నినెలలకు అనుకూలమైందని, దోమను తట్టుకునే రకమని, పత్తి తీసేందుకు సులువుగా ఉంటుందని, గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. అందుకే రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు ఎఆర్‌ఎస్‌కే నరేష్‌గౌడ్, రైతులు సుధాకర్ రెడ్డి, నర్సింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న కార్మికులకు ఏడాది పొడవున 200 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో బుధవారం ఉపాధి సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీకి కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అసహనం వ్యక్తం చేశారు. గతేడాదితో పోలిస్తే 30 శాతం బడ్జెట్ తక్కువ కేటాయించారని విమర్శించారు. 18 రాష్ట్రాలకు మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.6,366 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మోహన్, రాజు, మొగిలన్న, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిని అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

డీలర్లు సమయ పాలనపాటించాలి

ఊట్కూరు: మండలంలోని ఆయా గ్రామాల దుకాణాల రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ శివశ్రీనివాస్ కోరారు. బుధవారం డీలర్ల సంఘం ఆధ్వర్యంలో విధుల్లో చేరిన తహసీల్దార్‌కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌకధరల దుకాణాలకు సమయపాలన పాటించి బియ్యం పంపిణీని సక్రమంగా చేపట్టాలన్నారు. రేషన్‌కార్డులో ఉన్న లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేవిధంగా డీలర్లు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, హరిప్రసాద్‌రెడ్డి, బాలరాజు, తిప్పరాస్‌పల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న డీలర్లు

గిడ్డంగి నిర్మాణ పనులు వేగవంతం



అమరచింత: మండలంలోని ధర్మాపురం శివారులో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్మన్‌గా దివంగత సాయిచంద్ కొనసాగుతున్న సమయంలో తన సొంత మండలంలో మార్కెట్ గోదాం నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులను ప్రారంభించారు. సాయిచంద్ అకాల మరణం అనంతరం గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న రజనీసాయిచంద్ గిడ్డంగి నిర్మాణ పనుల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకున్నారు. నాలుగు నెలల్లో పూర్తి స్థాయిలో గిడ్డంగి పనులు చేపట్టలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సైతం గిడ్డంగి నిర్మాణ పనుల్లో చొరవ చూపడంతో వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. మరో 40 రోజుల్లో గిడ్డంగి పనులు పూర్తి చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. పనులు పూర్తయితే ఇక్కడి రైతులతో పాటు ప్రభుత్వం ధాన్యం భద్రపర్చుకునే అవకాశం ఉంది.

గుంతలమయంగా రోడ్డు



మురహర్‌దొడ్డి రోడ్డులో గుంతలు

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి గ్రామ బీటీరోడ్డు గతరెండు సంవత్సరాలుగా మరమ్మతులు చేయించకపోవడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం రోడ్డు వెంబడి ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టైరోడ్డు నుంచి ము రహర్‌దొడ్డి వరకు బీటీరోడ్డు మరమ్మతులకు గాను సంవత్సరం క్రితమే ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ఈ విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్డుకు మరమ్మతులు జరగడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.